రోడ్ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రహదారుల నిర్మాణానికి కృషి

కొత్తూరు, అక్టోబర్ 8: నూతన రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో హెచ్ఆర్డీసీఎల్ కింద నిర్మిస్తున్న జేపీ దర్గా, కుమ్మరిగూడ రోడ్ల కోసం స్థలాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూరు చాలా రహదారులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటన్నింటిని వీలైనంత త్వరగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. రోడ్ల వెడల్పునకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. రోడ్డు విశాలంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్, జనార్దనచారి, నవీన్‌చారి, నర్సింహ, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

తుర్కయాంజాల్, అక్టోబర్ 8: నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధా, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి అన్నారు. మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో క్యూస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు యువతి,యువకులు పలు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగం కల్పిస్తామని క్యూస్ కార్పొరేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్ మంగమ్మ, ఉదయశ్రీ, మాధవి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, నాయకులు ధన్‌రాజ్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీ సీఐగా కృష్ణంరాజు

యాచారం, అక్టోబర్8: మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఉన్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహారావు మహేశ్వరం ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. అతడి స్థానంలో నూతన సీఐగా లిక్కి కృష్ణంరాజు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరం ట్రాఫిక్ సీఐగా ఉన్న కృష్ణంరాజు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతకు శశికళ

యాచారం, అక్టోబర్8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడెపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 19, 20తేదీల్లో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ కళాజాత కార్యక్రమానికి మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్, జానపద గాయకురాలు మద్దెల శశికళ ఎంపికయ్యింది. ప్రపంచ తెలుగు సాహితి కళాజాత కార్యక్రమంలో మద్దెల శశికళ తన గళాన్ని వినిపించనుంది. అంతర్జాతీయ స్థాయిలో మారుమూల గ్రామం నుంచి తన గళాన్ని వినిపించే అవకాశం రావడం ఎంతో గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 8 : చేవెళ్ల మండల పరిధి ఊరెళ్ల గ్రామ పారిశుధ్య కార్మికులకు మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం వారికి దుస్తులు పంపిణీ చేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ ఉప సర్పంచ్ విఠలయ్య ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మొయినబాద్, అక్టోబర్ 8 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం మండల పరిధిలోని తోలుకట్టా గేట్ వద్ద చేవెళ్ల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశం మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలను పాటించని వాహనదారులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మైసమ్మతల్లికి పూజలు

ఆలయంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబర్ 8: మైసిగండి గ్రామంలోని మైసమ్మ దేవతను మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట నాయకులు జవహర్‌లాల్‌నాయక్, హీరాసింగ్, తులసీరాంనాయక్, రాము, సుధీర్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

వరిలో సరైన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి
ప్రస్తుతం గింజ పోసుకునే దశకు చేరుకున్న వరిపంట

ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 8 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అధికశాతం మంది రైతులు ఈ ఏడాది వానకాలం సీజన్‌లో వరిపంటను సాగుచేశారు. ప్రస్తుతం పంట గింజ పోసుకునే దశలో ఉంది. ఈ దశలో పురుగులు, తెగుళ్లు, ఎక్కువగా పంటలను ఆశించి తీవ్రనష్టం కలిగించే అవకాశమున్నందున రైతులు సరైన సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మాడ్గుల మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున వరిసాగు చేశారు. ప్రస్తుతం పైరు గింజ పోసుకుంటున్నందున పంటకు ఈ సమయంలో సుడిదోమ, మెగిపురుగు, పాముపొడ, నల్లకంకి వంటి తెగుళ్లు పంటను అధికంగా ఆశించే అవకాశం ఉన్నందున వాటిని నివారించేదదుకు పంటలకు తెగుళ్లు సోకకుండా ఉండేందుకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు మేరకు పంటలకు మందులు పిచికారీ చేస్తే పంటను రక్షించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని ఇబ్రహీంపట్నం వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత తెలిపారు.

నల్లకంకి తెగులు..

వరిపంటకు నల్లకంకి తెగులు సోకితే 30శాతం వరకు పంట దిగుబడిలో నష్టపోవాల్సి వస్తుంది. అలంతేకాక గింజ నాణ్యత కూడా బాగా తగ్గుతుంది. నల్లకంకి తెగులు కంకినల్లి అనే పురుగు నుంచి వస్తాయి. ఈ కంకినల్లి ఆకుమట్టల్లో, ఆకు మధ్య ఈనెల్లో గుంపులుగా నివసిస్తాయి. ఇవి చాలా సన్నగా ఉంటాయి. రైతులు వెంటనే అంత సులభంగా గుర్తించలేరు. సూక్ష్మదర్శిని ద్వారా మాత్రమే కంకి నల్లులను స్పష్టంగా చూడగలం. ఇవి పంట పిలక దశలో ఆకు ఈనెల్లో వృద్ధి చెందుతాయి. ఈ కంకినల్లి పంటపూత దశలో పంట గింజపాలుపోసుకునే దశలో గింజలను ఆశించి పంటలను బాగా నష్టపరుస్తాయి. పంటను కంకినల్లి ఆశించినప్పుడు తొలి దశలోనే ఆకుల మధ్య ఈనెపై, ఆకుల మట్టలపై, కాండంపై ముదురుగోధుమ నుంచి నల్లటి మచ్చలు ఏర్పడుతాయి.

నివారణ చర్యలు..

పంటను కంకినల్లి ఆశించకుండా ఉండాలంటే కలుపు మొక్కలను పొలంలోనూ, గట్లమీద లేకుండా చూసుకోవాలి.
నత్రజని ఎరువులను తగిన మోతాదులో వేసుకోవాలి.
కంకినల్లిని కంటితో గమనించలేం. కావున ఆకుల మధ్య ఈనె, ఆకు మట్టలపై కాండంపై గోధుమ, నలుపురంగు మచ్చలు గమనించిన ప్పుడే కంకినల్లి ఆశించినట్లుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి.

పొలంలో కంకినల్లి ఆశించిన లక్షణాలు కనిపించగానే డైకోఫాల్ 5మిల్లీలీటర్లు, ప్రొఫినోపాస్ 2మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
పదిహేను రోజుల వ్యవధిలో రెండుసార్లు మందును మార్చి పిచికారీ చేయాలి.
కంకినల్లి బాగా ఆశించే ప్రాంతాల్లో పంట కోసిన తర్వాత వరి మొదల్లు లేకుండా సమూలంగా నాశనం చేయాలి.

మొగిపురుగు..

మొగి పురుగు వరి పంటకు నారుమడి దశనుంచి పంట పూర్తిగా గింజపోసుకునే దశ వరకు ఆశిస్తుంది. తల్లి పురుగు ముదురురంగులో ఉండి ముందు రెక్కలపై నల్లటి మచ్చలను కలిగి ఉంటుంది. ఈ పురుగులు గోధుమరంగు వెంట్రుకలతో కప్పిన గుడ్లను గుంపులుగా నారుమళ్లలో పెడుతాయి. నాటిన పొలంలో అయితే మొక్కల ఆకుల చివరిభాగాల్లో పెడుతాయి. మొక్క జిలకలు తొలిగే దశలో ఈ పురుగు ఆశిస్తే ఎండిపోయి చనిపోతాయి. పురుగు ఆశించిన మొక్కల మొవ్వలు, కంకులను లాగితే అవి తేలికగా బయటకు వస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఈ పురుగు నారుమడిలో కొనలపై గుడ్లు పెడితే నాటువేసే సమయంలో ఈ కొనలను తుంచేయాలి.
నాటిన తరువాత చిరుపొట్ట దశలో పురుగును గమనిస్తే ఎకరాకు 10కిలోల కార్బోఫ్యూరాన్ లేదా 8కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలను పంటపొలంలో వేయాలి.
చిరుపొట్ట దశ దాటాక పంటపొలంలో పురుగులను గమనిస్తే ఎకరాకు 500 గ్రాములు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పొడి మందును 200లీటర్ల నీటిలో కలిపి పైరు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. లేదా, ఎకరాకు క్లోరోఫైరిపాస్ 500 మిల్లీలీటర్లు లేదా ఫాస్ఫామోరన్ 400మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 300గ్రాములు 200లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.
పురుగు తీవ్రతను బట్టి 10నుంచి 15రోజుల వ్యవధిలో మందులను మారుస్తూ పిచికారీ చేయాలి. చివరిగా పంటను కోసేటప్పుడు దుబ్బులను నేలమట్టం వరకు కోయాలి. దీనివల్ల మళ్లీ వచ్చే పంటల్లో పురుగు ఉధృతి తగ్గించవచ్చును.

పాముపొడ తెగులు..

పాముపొడ తెగులు సోకిన వరిమొక్కలపై పొడలు, పొడలుగా మచ్చలు ఏర్పడుతాయి. గట్లపై ఉండే గడ్డివల్ల ఈ తెగులు వరిపంటకు వ్యాపిస్తుంది. నత్రజనిని అధిక మోతాదులో వాడటం వల్ల కూడా ఈ తెగులు వరిపంటలో వ్యాప్తిచెందుతుంది.

నివారణ చర్యలు..

ముందుగా పొలంలో గట్లపై ఉన్న గడ్డిని కోసేసి గట్లను శుభ్రం చేయాలి. తెగులు ఉధృతిని బట్టి ఒక్క లీటర నీటికి ప్రొపికోనజోల ఒక మిల్లీలీటర్ లేదా హెక్సాకజోనల్ లేదా వాలిడా మెసిస్ 2మిల్లీలీటర్ల చొప్పున పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.
వరిపైరు గింజ పోసుకునే దశలో తెగులు ఉధృతి పెరిగితే గింజలు పాలుపోసుకోకుండా నల్లగా మారే అవకాశం ఉంటుంది. తక్షణమే తెగుళ్లను నివారించే చర్యలు చేపట్టాలి.

సుడిదోమ..

వరిపంటకు అధికంగా నత్రజనిని అందించడం వల్ల సుడిదోమ పంటపొలంలో వ్యాప్తి చెందుతుంది. గోధుమవర్ణం కలిగిన ఈ సుడిదోమలు వరిదుబ్బల మొదళ్ల వద్ద నీటిమట్టంపై గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తుంటాయి. దీంతో పంట సుడులు, సుడులుగా ఎండిపోతుంది. ఈ సమయంలో సుడిదోమను వెంటనే నివారించకపోతే పంట అంతా కూడా సుడిదోమ బారిన పడి పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉన్నది.

నివారణ చర్యలు..

రైతులు ప్రతినిత్యం వరిదుబ్బలు. మొదళ్లను గమనిస్తూ ఉండాలి.
వరిదుబ్బకు 20కి మించి సుడిదోమలు కనిపిస్తే ప్రతి 2మిల్లీమీటర్లకు 30సెంటిమీటర్ల వెడల్పులో పాయలు తీసి గాలి, వెలుతురు దుబ్బలకు తగిలేలా చూడాలి. పంటలో వెంటనే నీటిని తీసేసి ఆరుతడి పద్ధతిలో పంటకు నీటిని అందించాలి.
నత్రజనిని అధికమోతాదులో వాడకుండా తగిన మోతాదులో వాడాలి.
వరి దుబ్బుకు 20నుంచి 25దోమలు ఆశించి ఉంటే ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ 40మిల్లీలీటర్లు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 50నుంచి 100వరకు దోమలు ఆశించి ఉంటే ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ 40మిల్లీలీటర్లు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 50నుంచి 100వరకు దోమలు ఆశించి ఉంటే ఎకరాకు ఒక లీటరు నీటికి 1.5గ్రాములు ఎసిఫేట్ లేదా 1.5మిల్లీలీటర్లు ఇడోఫిన్‌ప్రాక్స్ మొదళ్ల దగ్గర పడేలా పిచికారీ చేయాలి.
చిరుపొట్ట దశకు రాని వరిపైర్లలో సుడిదోమను గమనిస్తే ఎకరాకు 10కిలోగ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను వరిపైరులో చల్లుకోవాలి.
వరిదుబ్బలకు 100నుంచి 200వరకు సుడిదోమలు ఆశిస్తే ఒక లీటరునీటికి ఎసిఫేట్ 2గ్రాములు, డైక్రోఫాస్ ఒక మిల్లీలీటర్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
దోమ తీవ్రంగా ఉంటే బుప్రోఫెజిన్ ఒక లీటరు నీటికి 1.5మిల్లీలీటరు కలిపి పిచికారీ చేయాలి.

సరైన జాగ్రత్త పాటించాలి

వర్షాకాలం పంటల సాగులో వరిపంటను సాగుచేసుకున్న రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలి. సాగుచేసిన పంటలు ప్రస్తుతం గింజపోసుకునే దశలో ఉన్నందున చీడపీడలు ఆశించే అవకాశముంది. రైతులు ఈ సమయంలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు మందులను పిచికారీ చేయాలి. చేతికందవచ్చిన పంటలను కాపాడుకునేందుకు సరైన మెళకువలు పాటిస్తే పంట దిగుబడి అధికంగా వస్తుంది. వరిపంటకు మందులు చల్లే క్రమంలో నేరుగా మందులు చల్లకుండా ఇసుకలో కలిపి చల్లాలి.

- శ్రవణ్‌కుమార్, ఏఈఓ ఇబ్రహీంపట్నం

డంపింగ్‌యార్డును తొలగించండి

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 8: గ్రామానికి సమీపంలోని డంపింగ్‌యార్డుతో ఊరు విడిచే పరిస్థితి నెలకొన్నదని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 5వ వార్డు సోలిపూర్ గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డును తొలగించాలని కోరుతూ మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం షాద్‌నగర్ పట్టణంలో సేకరించే చెత్తా చెదారాన్ని గ్రామ సమీపంలోని డంపింగ్‌యార్డులో వేస్తుండడంతో భరించలేని దుర్వాసన వస్తుందన్నారు. దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డులో దవాఖానాల వ్యర్థాలు, కెమికల్స్ వేయడం ద్వారా అవి వర్షపునీటితో భూమిలో ఇంకిపోయి భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యాయన్నారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్‌యార్డును తొలగించడంతో పాటు దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు జంగయ్య, వెంకటేశ్, నర్సింహులుయాదవ్, ఆనంద్, రమేశ్‌యాదవ్, కుమార్, సోమ్లానాయక్, హరీష్, ఆంజనేయులుగౌడ్, వెంకటేష్‌గౌడ్, శివకుమార్, శ్రీహరి, రాజ్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

షాద్‌నగర్, అక్టోబర్8: బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని కొందుర్గు మండల కేంద్రంలో భగత్‌సింగ్ యువజన సంఘం మండపం వద్ద ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్, గ్రామ మహిళలు అంజమ్మ, మాధవి, మల్లమ్మ, హారిక, మణెమ్మ, మమత, కలమ్మ, యాదమ్మ, సువర్ణ, పావణి, లావణ్య, జయమ్మ, లలిత, స్వరూప, బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, ఎల్లప్ప, రజినికాంత్, నవీన్, అంజయ్య, మల్లేశ్, యాదగిరి, తేజ, గ్రామస్తులు పాల్గొన్నారు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

షాబాద్, అక్టోబర్ 8: అంతారం మిషన్ భగీరథ ప్రాజెక్టులో పనిచేసే సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ ప్రాజెక్టు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో కాంట్రాక్టు కింద 15 మంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నంరూరల్ : పంచాయతీ కార్మికులకు నెలనెల కనీస వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికి వేతనాలు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని ఆయన డిమాండ్ చేశారు.

నిర్మాణ పనులు ప్రారంభించాలి

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, అక్టోబర్ 8: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేసిందని, నూతన మండలం కడ్తాల్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గతంలోనే నిధులు మంజూరు చేయించారని, సంబంధిత అధికారులు వెంటనే దవాఖాన నిర్మాణ పనులను ప్రారంభించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు ఆర్వీ కర్ణన్‌ని లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు రూ.1.43 కోట్లు నిధులు మంజూరు కావడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. మండల కేంద్రానికి మంజూరైన పీహెచ్‌సీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కర్ణన్‌ని కోరినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు నరేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, అశోక్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

డీజే ఆపరేటర్లతో మాట్లాడుతున్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్, అక్టోబర్ 8 : న్యాయస్థానం మార్గదర్శకాలను ఉల్లంఘించిన డీజే ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో డీజే ఆపరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత న్యాయం స్థానం జారీ చేసి మార్గదర్శకాల ప్రకారం ఈవెంట్ నిర్వాహకులు కాని, డీజే ఆపరేటర్లు కాని తప్పకుండా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకుని లైసెన్స్‌లు పొందాలని అన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా డీజే ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ముజాఫర్ అలీ, ఏఎస్ఐ శివారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మహేశ్

ఆమనగల్లు, అక్టోబర్ 8: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని అయప్ప కొండ వద్ద ఆమనగల్లు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వగ్గు మహేష్ మాట్లాడుతూ క్రీడలుమానసిక ఉల్లాసాన్ని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అర్గనైజర్లు ప్రసాద్, శివ సూర్య, యాదవ్, సైదులు, గణేశ్, నరేశ్, అశోక్, గోపి, శ్రీను, ప్రభు శంకర్ టీం స్పాన్సర్లు దేవేందర్, కృష్ణానాయక్, గుమ్మ కొండరాజు, చాంద్‌పాషా, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ ఎంబీఏ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై జహంగీర్

మొయినాబాద్, అక్టోబర్ 8: విద్యార్థులు గొప్ప లక్ష్యం ఎంచుకొని విద్యను అభ్యసిస్తే ఉన్నతశిఖరాలకు చేరుకుంటారని ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై జహంగీర్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో మంగళవారం ఓరియెంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం దిశగా విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు వ్యాపార రంగం వైపు అడుగులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి మల్లారెడ్డి, రమేశ్, రాజేందర్‌రెడ్డి, నందకిషోర్, స్వేత, జ్యోతిక, సోని, రాజేశ్, త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆమనగల్లు, అక్టోబర్8: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బగుట్ట కొండలపై సుమారు 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహం వద్ద పురుగుల మందు బాటిల్, మద్యం సీసా, వడ్రంగి పనులు చేసే కొన్ని వస్తువులు, ఒక బ్యాగ్ లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్‌తో పాటు సీఐ ప్రమోద్‌కుమార్ పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తూరు, అక్టోబర్ 8: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ యువకుడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొత్తూరు మండలంలోని మల్లాపూర్‌లో జరిగింది. కొత్తూరు ఎస్ఐ జి.శ్రీనివాస్ వివరాల ప్రకారం మండల పరిధిలోని మల్లాపూర్‌కు చెందిన శివకుమార్ (30) గ్రామ శివారులోని ఓపెన్ పార్కులో శివకుమార్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరి వేసుకొని మరణించాడు. శివకుమార్ ఆర్థిక కారణాలు, అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. శివకుమార్ తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహాలక్ష్మి..కరుణించు..

షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో మహాలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు

దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాలు, పట్టణాల్లో కొలువుదీరిన అమ్మవారు బుధవారం మహాలక్ష్మి, గాయత్రీదేవి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన చేసి పూజించారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

ఆమనగల్లు వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు